క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి తిరువీధి



స్వామివారిని పల్లకిలో ఉంచి భక్తులతో తిరువీధి చేయిస్తున్న అర్చకులు

సీతానగరం: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గోవింద మాలాధారణచేసిన భక్తులు నగర సంకీర్తనలు, మేల్కొపులు ఆలపించారు. ఈ మేరకు సీతానగరం మండలంలో సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాల స్వామి ఆలయంలో గోవిందమాలలు ధరించిన భక్తులు నదిలో స్నానాలు చేసుకుని పూజలు చేసి కిలోమీటరు దూరం వరకూ నగర సంకీర్తన, గోవింద నామాలు పఠించారు. నగర సంకీర్తన అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి వారిని పల్లకిలో అధిష్ఠించిన ఆలయ అర్చకులతో కలిసి తిరువీధి చేశారు. ఈ నెల 15వ తేదీవరకూ ధనుర్మాసం పూజలు జరుగుతాయని ఆలయ అర్చకుడు తెలిపారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



విశాఖ కేజిహెచ్‌లో లబ్ధిదారు జగన్‌మోహన్ రావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నజీమా షేక్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన పాట్నూరు జగన్‌మోహన్‌రావు ఆరోగ్య పరిస్థితి సరిగాలేక విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వలంటీర్ నజీమా షేక్ ఆదివారం విశాఖపట్నం వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందజేసింది. పింఛన్ డబ్బులు బాధితులకు అవసరమవుతాయని భావించి పింఛన్ అందించినట్లు ఆమె తెలిపారు.

అయోధ్య రామ మందిర అక్షతల పంపిణీ



అక్షతలను భక్తులకు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అయోధ్య రామమందిర అక్షతలను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని డబ్బివీధి రామమందిరం వద్ద అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను పలువురు భక్తులకు అందజేశారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

సాలూరు: భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లారీ కార్మికులు ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన ఈ చట్టం వల్ల లారీ కార్మికులు, యజమానులకు తీవ్ర నష్టమని వాపోయారు. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ నాయకులు సి.రామచంద్రరావు,నాయకులు, కార్మికులు, పాల్గొన్నారు.

పరీక్షిత్‌రాజు పరామర్శ

గరుగుబిల్లి: తోటపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాడ నారాయణరావు ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం తోటపల్లి వెళ్లి నారాయణరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఏజెన్సీలో సెల్‌టవర్ ఏర్పాటు

సీతంపేట: ఏజెన్సీ గ్రామాల్లో సెల్‌ఫోన్లు మోగనున్నాయి. ఇన్నాళ్లు సిగ్నల్స్ లేక ఇబ్బంది పడిన గిరిజనులకు సిగ్నల్ కష్టాలు తీరనున్నాయి. గిరిశిఖర గ్రామమైన వజ్జాయిగూడలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేశారు. ఈ టవర్ అందుబాటులోకి వస్తే ఏజెన్సీలోని సుమారు 40 గ్రామాలకు సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. గతంలో అత్యవసర సమయంలో 108కి ఫోన్ చేయాలన్నా సిగ్నల్ లేక కొండపైకి వెళ్లి ఫోన్ చేయాల్సి వచ్చేది. ఇకపై ఆ పరిస్థితి ఉండదని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో తమకు పూర్తి న్యాయం జరుగుతుందని నమ్మి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో తమ వార్డుల్లో అభివృద్ధి జరుగుతున్న తీరు నచ్చి బెలగాం ప్రాంతంలోని 15, 16, 18 వ వార్డుల నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీరంతా కోరుకున్న విధంగా వార్డులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, శ్మశానానికి రహదారి నిర్మాణం తప్పక చేపడతామని హామీ ఇచ్చారు. మీ అందరికీ పార్టీలో సముచిత స్థానం ఇవ్వడంతో పాటు మీ గౌరవాన్ని మరింత పెంపొందింస్తామని, మాట ఇస్తూ అందరం కలిసికట్టుగా రానున్న సాధారణ ఎన్నికల్లో కష్టపడి పనిచేసే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు తాడ్డి అప్పారావు, పైడాన అప్పారావు, మూడడ్ల పకీరు, భీమవరపు శ్రీను, జెంజేటి శ్రీనివాసరావు, బోను శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, గణేష్, బొంగు శ్రీధర్, గోళ్ల చిన వెంకట్రావు, మీసాల వెంకటరమణ, నడిమింటి శ్రీనివాసరావు, బోనెల కిశోర్ చంద్రకుమార్‌దొర తదితరులు స్థానిక కౌన్సిలర్ చీకటి అనురాధ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్లు చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, ఎస్.చిన్నం నాయుడు, ఎస్.సందీప్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

జనసేన కార్యకర్తల చేరిక

పార్వతీపురం పురపాలక సంఘంలో గల జనసేన కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణానికి చెందిన 3 వ వార్డు జనసేన కార్యకర్తలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మెచ్చి పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో 3 వవార్డు కౌన్సిలర్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిలో రంగ హరి..!

మొదలైన హరిదాసుల సందడి



పార్వతీపురం పట్టణంలో హరినామ కీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

పార్వతీపురం: మరికొద్ది రోజుల్లో సంక్రాంతి పండగ రానున్న తరుణంలో పార్వతీపురం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో హరిదాసుల సందడి నెలకొంది. ఒక చేతితో తంబుర, మరో చేతితో చెక్కలు, నెత్తిన అక్షయపాత్ర ధరించి పురవీధుల్లో కాలినడకన తిరుగుతూ నిత్యం హరి నామస్మరణ చేసే హరిదాసులు పండగ వేళ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నారు. రామయ్య తండ్రికి గుడికట్టించి, సీతమ్మ తల్లికి చింతాకు పతకం చేయించి రామదాసు జైలు పాలయ్యాడు. ఇలా భక్తితత్వాన్ని ప్రచారం చేస్తూ హరిదాసులు మన పల్లెల్లో సంప్రదాయాలు కనుమరుగవకుండా కాపాడుతున్నారు. ఏటా ధనుర్మాస ఆరంభంలో వారి సందడి ఒకప్పటి వైభవాన్నే కాకుండా మన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లను గుర్తుచేస్తున్నాయి. ఎక్కడెక్కడో పుట్టిపెరిగి దైవ నామస్మరణ చేసుకునే వారెందరికో ఈప్రాంతం నిలయంగా మారింది. కార్తీకమాసం ప్రారంభం నుంచి భోగి వరకు రాష్ట్ర నలుమూలలా దాదాపు వంద మంది హరిదాసులు రామనామస్మరణ చేసుకుంటూ పట్టణాలు, గ్రామాల్లో ప్రజల మన్ననలు, ఆదరణ పొందుతున్నారు. రామనామస్మరణ చేస్తూ వీధుల్లో తిరుగుతూ గత వైభవాన్ని గుర్తు చేస్తున్నారు. ఇలా ఊరూరా తిరిగి సేకరించిన ధనధాన్యాదులను భోగి తరువాత భద్రాద్రిలోని రామాలయంలో 25 శాతం ప్రజల తరఫున జమ చేసి మిగిలిన వస్తువులను తమ జీవనానికి ఉపయోగిస్తామని హరిదాసులు చెబుతున్నారు.

19న అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఈ నెల 19న ప్రపంచంలోనే ఎత్తైన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు ఆవిష్కరించనున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన గృహంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో ముందుగా ఈ నెల 9 నుంచి 12 వరకు పలు కార్యక్రమాలను చేపడుతున్నమని వివరించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు సచివాలయాల పరిధిలో పార్టీ నాయకులందరి భాగస్వామ్యంతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వివరాలు తనకు అందిస్తే తానే రంగులు వేయిస్తానని చెప్పారు. వాడవాడలా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, అటువంటి వ్యక్తిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

సుబ్బమ్మపేరంటాలు జాతరకు ఏర్పాట్లు



పూజలకు సిద్ధమైన సుబ్బమ్మ పేరంటాలు విగ్రహాలు

సీతానగరం: మండలంలోని జోగింపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా పూజించే సుబ్బమ్మ పేరంటాలు జాతరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి కావచ్చాయని సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆలయం వద్ద మాట్లాడుతూ జోగింపేటలో గురువారం సుబ్బమ్మ పేరంటాలు జాతర నిర్వహించాలని అర్చకులు ముహూర్తం నిర్ధారించడంతో జాతరకు ఈ గ్రామం నుంచి మనువువెళ్లి ఆడపడుచులు, ఇక్కడినుంచి వివిధ కారణాలవల్ల దేశవిదేశాల్లో ఉన్న వారు, జీవనోపాధి కోసం వలస వెళ్లిన వారంతా పేరంటాలు ఉత్సవానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే వివిధ పట్టణాలకు చెందిన ప్రముఖులతో పాటు 40 గ్రామాలనుంచి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు జాతరకు వస్తారన్నారు. ఈ క్రమంలో భక్తులకు మెరుగైన సేవలందించడానికి, తాగునీరు సరఫరా చేసేందుకు అనుకూలంగా సుబ్బమ్మపేరంటాలు గుడిని ఆనుకుని ఉన్న చెరువుగట్టు, మూడు పక్కలా ఉన్న రహదారులను శుద్ధి చేయిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవకమిటీ సూచనలమేరకు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడంతో పాటు రాష్ట్ర రహదారి జంక్షన్ నుంచి పేరంటాలు గుడివరకూ పారిశుద్ధ్య పనులు న్విహించనున్నట్లు చెప్పారు.

కోవిడ్ పరీక్షలకు ప్రత్యేక గదులు



పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మిస్తున్న కోవిడ్ పరీక్ష గదులు

సీతానగరం: మండల కేంద్రంలో ఉన్న రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీ ఆవరణలో కోవిడ్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించడానికి, మెరుగైన వైద్య సేవలందించడానికి లక్షలాది రూపాయలతో ప్రత్యేక గదుల నిర్మాణం జరుగుతోందని సీహెచ్‌ఓ ఎస్వీ రమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కరోనా లక్షణాలతో అడపాదడపా కేసులు నమోదవుతున్నాయని, కరోనా లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న వారికి అత్యవసర వైద్యసేవలకు ప్రభుత్వం అవసరమైన మందులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో అదనపు గదుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఇంతవరకూ ఇక్కడి పరిసర ప్రాంతాల్లో కేసులు నమోదు కాలేదన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వైద్యాధికారుల పర్యవేక్షణలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలను చైతన్య పర్చడానికి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం సోమగండి గ్రామ సచివాలయ వద్ద సర్పంచ్ ఎస్.రుతోని ఆధ్వర్యంలో స్పోర్ట్స్ టీ షర్టులు, టోపీలు పంపిణీ చేశారు. మండల స్థాయి క్రీడల్లో రాణించాలని క్రీడా కారులకు సూచించారు.

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పార్కు అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని రామా కాలనీ పార్కు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 50 లక్షల రుపాయల బుడా నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వాకింగ్ ట్రాక్, వివిధ రకాల పూల మొక్కలతో పాటు ఔషధ మొక్కలు నాటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పార్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కమిషనర్ జయరామ్, ప్రజాప్రతినిధులు, నాయకులు రమణ, పి.మోహన్, శేషు, శంకరి, వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పరిశీలన



వెంకంపేటలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్వతీపురం అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు వెంకంపేట గ్రామ రెవెన్యూ పరిధిలో విశాలమైన జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసి ఇళ్ల నివాసాలు ఇచ్చిన జగనన్న ప్రభుత్వంలో జోరుగా కొనసాగుతున్న గృహ నిర్మాణం తీరుపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో ఎమ్మెల్యే కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహనిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, కాలనీలో అవసరమైన కరెంట్, నీటి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీనుల బలం బీఆర్ అంబేడ్కర్

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: బలహీనుల బలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ నెల 19న విగ్రహావిష్కరణ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 8,9 తేదీల్లో మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, సమన్వయ సమావేశాలు నిర్వహించి మహనీయుడి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేలా అన్ని వర్గాల ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. 9 నుంచి 12వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద ప్రజల సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాలని సూచించారు. దళిత సంఘాల నాయకులను కలుపుకుని గ్రామాల్లోని కూడళ్ల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించాలని కోరారు.

నవోదయ మోడల్ టెస్ట్‌కు అపూర్వ స్పందన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు, ఎస్సై కళాధర్

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు అపూర్వ స్పందన లభించింది. జిల్లాలోని 16 మండలాలకు చెందిన 334 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంఈఓ-2 శ్రీనివాసరావు, చినమేరంగి ఎస్సై కళాధర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న నిర్వహించే నవోదయ పరీక్షకు ఈ మోడల్ టెస్ట్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించిన ఈ పరీక్షకు 254 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ఎంఈఓ ఆర్.ఆనందరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోలాటం మహిళలకు ప్రశంసలు



గిరిజన మహిళలకు కోలాటం శిక్షణ ఇస్తున్న గురువు కె.ప్రసాద్

సీతానగరం: మండలంలోని చిన్నారాయుపేట గ్రామంలో మహిళలు కోలాటం, జానపద ప్రదర్శనల్లో పాల్గొంటుండడంతో ప్రజలనుంచి ప్రశంసలు పొందుతున్నారు. అధికంగా గిరిజన కుటుంబాలున్న గ్రామంలో గిరిజన మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కోలాటాల రూపంలో రాత్రి పూట ప్రదర్శిస్తున్నారు. కోలాటం నేర్పడానికి అదేగ్రామానికి చెందిన కోటిపల్లి ప్రసాద్ పొదుపుసంఘాల సభ్యులను ముందుగా 14 మందిని ఎంపిక చేశారు. విరామ సమయంలో(రాత్రి పూట) 1 గంట శిక్షణ ఇవ్వడంతో మహిళలంతా శిక్షణ పొందిన అనంతరం గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులనుంచి ప్రశంసలు పొందుతున్నారు.

జగనన్న మళ్లీ రావాలి



సభకు హాజరైన పింఛన్ లబ్ధిదారులు



కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారుకు డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కొమరాడ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో ఆమె పాల్గొని మాట్లాడారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత వలంటీర్ల ద్వారా ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు చేరవేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, కొత్త పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సులు లేకుండా, అర్హతే ప్రామాణికంగా పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధన్యత ఇవ్వడం ద్వారా పేదల జీవన ప్రామాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మీ, మండల కన్వీనర్ డి.జనర్ధనరావు, వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, నాయకులు శెట్టి మధుసూదనరావు, కళింగి మల్లేశ్వరరావు, కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరపునాయుడు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలి

పాలకొండ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని కార్మిక సంఘ నాయకులు పి.భాస్కరరావు, సీహెచ్.సంజీవి తదితరులు కోరారు. కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు డి.రమణారావు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, కారుణ్య నియామకాలకు అవకాశం, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్య పెంపు, తదితర డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ నినాదాలు చేశారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జే.కే పాడు కాలనీకి చెందిన అడ్డాకుల భాగ్యలక్ష్మికి వైఎస్సార్ బీమా మంజూరైంది. ఆమె భర్త అడ్డాకుల నరేష్ మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందడంతో.. ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సర్పంచ్ ఆర్‌ఎస్ చైతన్య ప్రవంతి ఆదివారం భాగ్యలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సచివాలయ కన్వీనర్ సూర్యప్రకాష్ తదితరులున్నారు.